సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37 వేలు పలికాయి. మార్కెట్‌కు 752 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.14

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
42.1°/21.8°

జిల్లా పరిధిలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో పడమటి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

20న లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి రాక

పుట్టపర్తి అర్బన్: రెండు రోజుల పర్యటన నిమిత్తం లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణ్‌రెడ్డి ఈనెల 20వ తేదీన జిల్లాకు విచ్చేయనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20వ తేదీ ఉదయం 10 గంటలకు ధర్మవరానికి విచ్చేయనున్న జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి అక్కడి పోలీస్ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారన్నారు. అనంతరం రెండు రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. 21వ తేదీ సాయంత్రం 4 గంటలకు కర్నూలుకు వెళ్తారన్నారు.

24, 25 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులు ఈనెల 24, 25 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫారం–12డీ దరఖాస్తులను పూర్తి చేసి ఆయా తేదీల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు. ఒక్క ఓటరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అరుణ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. మంగళవారం తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై సీఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుతున్నామని తెలిపారు. అలాగే తాగునీటి ఎద్దడి తలెత్తిన 153 గ్రామాలకు 415 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. కూలీలు పని చేసే ప్రదేశంలో నీడకోసం టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచామని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సైతం అందిస్తున్నామన్నారు. వీసీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూఏ పరిధిలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంటెక్ ఆర్–21 ఒకటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. అలాగే ఆర్–17 ఒకటి, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఆర్–21, ఆర్–17 రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ, డిసెంబర్, జనవరి నెలలో నిర్వహించిన ప్రీ పీహెచ్‌డీ (వింటర్ సెషన్) పరీక్ష ఫలితాలూ విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఫలితాలను జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

చల్లని కబురు

- 20, 21 తేదీల్లో వర్ష సూచన



బుక్కరాయసముద్రం: భానుడి భగభగలతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాస్త్రవేత్తలు చల్లని కబురు చెప్పారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 40.6 – 42.5 డిగ్రీల మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 27.1–27.6 డిగ్రీల మధ్య నమోదు కావచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 48–56 శాతం, మధ్యాహ్నం 23–28 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రగతి బాటలు



పుట్టపర్తి మండలం జగరాజుపల్లి-పిల్లిగుండ్లు రోడ్డు

5.6 కిలోమీటర్లు, రూ.3.7 కోట్ల వ్యయం



కొత్తచెరువు మండలం బండ్లపల్లి క్రాస్ - విరుపాపురం రోడ్డు

3 కిలోమీటర్లు, రూ.1.32 కోట్ల వ్యయం



రొద్దం మండలం నారనాగేపల్లి - కొత్తపల్లి క్రాస్ రోడ్డు

3 కిలోమీటర్లు, రూ.1 కోటి వ్యయం



సోమందేపల్లి మండలం కొత్తపల్లి క్రాస్ - కేతగాని చెరువు రోడ్డు

12 కిలోమీటర్లు, రూ.16 కోట్ల వ్యయం

రహదారులు నాగరికతకు చిహ్నాలంటారు. రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి పల్లెలోనూ ప్రగతి పరుచుకుంటుంది. కానీ గత టీడీపీ పాలకులు రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. కొన్ని గ్రామాలకూ కాలిబాటలే దిక్కయ్యాయి. ఎన్నో పల్లెలు ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండిపోయాయి. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని స్థితిలో ఎందరో గ్రామీణుల ప్రాణాలు గాల్లో కలిశాయి. ఇతర గ్రామాలకు వెళ్లే అవకాశం లేక బాలికలు చదువులకు దూరమయ్యారు. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పల్లెలకు ప్రగతి బాటలు వేశారు. గ్రామాల్లో అంతర్గత రహదారులతో పాటు పల్లెలను పట్టణాలకు కలుపుతూ తారు రోడ్లు వేశారు. అలాగే రూ.కోట్లు ఖర్చు చేసి అంతర్రాష్ట్ర రహదారులతో పాటు జాతీయ రహదారులను అభివృద్ధి చేశారు. అర్ధరాత్రి వేళ కూడా మారుమూల పల్లెలకూ వెళ్లే సౌకర్యం కల్పించారు. ఇప్పుడు ఏ గ్రామానికి వెళ్లినా తళతళమంటూ మెరిసే తారు రోడ్లు, పల్లెపల్లెనా సిమెంట్ రోడ్లు దర్శనమిస్తున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్





రొళ్ల మండలం హొట్టేబెట్ట - దొమ్మరహట్టి రోడ్డు

12.6 కిలోమీటర్లు, రూ.18 కోట్ల వ్యయం



పెనుకొండ ఎన్టీఆర్ సర్కిల్ - షేఫారం రోడ్డు

2.5 కిలోమీటర్లు, రూ.20 కోట్ల వ్యయం



పెనుకొండ కొండపైకి నిర్మించిన రోడ్డు

7 కిలోమీటర్లు, రూ.14 కోట్ల వ్యయం



పెనుకొండలోని సుంకలమ్మ దేవాలయం - దొమ్మతిమర్రి రోడ్డు

22 కిలోమీటర్లు, రూ.25 కోట్ల వ్యయం



పరిగి నుంచి మడకశిర మండలం కల్లుమర్రి వరకు రోడ్డు

8 కిలోమీటర్లు, రూ.2 కోట్ల వ్యయం



ధర్మవరం మెయిన్ రోడ్డు

5 కిలోమీటర్లు, రూ.4 కోట్ల వ్యయం



తాడిమర్రి మండలం మాల్యవంతం - పార్నపల్లి రోడ్డు

26 కిలోమీటర్లు, రూ.7 కోట్ల వ్యయం



నల్లచెరువు మండలం తుమ్మల - బండ్రేపల్లి రోడ్డు

1.80 కిలోమీటర్లు, రూ.1.42 కోట్ల వ్యయం



చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి - వెంకటంపల్లి రోడ్డు

3 కిలోమీటర్లు, రూ.60 లక్షల వ్యయం

జగన్‌ది జనరంజక పాలన

- చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మకండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కదిరి: 'చంద్రబాబు పాలనను చూశాం. ఇప్పుడు జగన్ పాలనను చూస్తున్నాం. బాబు పాలనలో అర్హత ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీలు చెబితే గానీ పేదలకు సంక్షేమ పథకాలు అందేవి కావు. నేడు ఆ పరిస్థితి లేదు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరుతున్నాయి. కానీ ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ఎన్నో అబద్ధపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారు. ఆయన మాటలు నమ్మకండి' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కదిరి నియోజకవర్గంలో పర్యటించారు. పలు మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని ప్రసంగించారు. 'నా పాలనలో మీకు మంచి జరిగి ఉంటేనే నాకు ఓటు వేయండి' అని చెప్పిన ముఖ్యమంత్రిని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. విభజన చట్టంలో ఉమ్మడి రాజధాని హైదరాబాద్ 10 ఏళ్లు ఉంటుందని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ చంద్రబాబు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి ఏపీకి పారిపోయి వచ్చాడని మంత్రి విమర్శించారు. అమరావతిలో రాజధాని పేరుతో కేవలం కొన్ని తాత్కాలిక భవనాలు నిర్మించి వేల కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు.



గాండ్లపెంటలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మద్యపాన నిషేధం ఎత్తేసింది బాబే..

గతంలో ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం అమలు చేస్తే... దాన్ని పూర్తిగా ఎత్తి వేసింది చంద్రబాబే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనతో పాటు ఆ పార్టీ నాయకులు మద్యనిషేధంపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని దుయ్యబట్టారు. అప్పట్లో రామారావు రూ.2కే కిలో బియ్యం ఇస్తుంటే... దాన్ని రూ.5.25కు పెంచి పేదలపై భారం మోపింది కూడా చంద్రబాబేనని గుర్తు చేశారు. జగన్ పాలనలో పేదలంతా సంతోషంగా ఉన్నారని, అందుకే మళ్లీ జగన్ పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పాలన ప్రజల ముంగిటకే వచ్చిందన్నారు. 'నాడు–నేడు' ద్వారా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. బడులు, ఆస్పత్రులు రూపురేఖలే మారిపోయాయని మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లు కరోనాతో సాగిపోయినప్పటికీ జగన్ పాలన మనం కేవలం మూడేళ్లే చూశామని, ఈసారి మళ్లీ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలుపుతారన్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ, కదిరి అసెంబ్లీ అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ ఇంకా పలువురు నాయకులు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

- డీఎఫ్ఓ నాగరాజు నాయక్
- కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు
- మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని డీఎఫ్ఓ నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎనుములపల్లి జిల్లా పరిషత్, వాసవీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహనతోపాటు మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా బయటపడాలో తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వంట పూర్తి చేసిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫైర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎనుములపల్లిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నామినేషన్లకు సర్వం సిద్ధం చేయాలి

ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలను ఆదేశించిన కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై అన్ని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, ఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 18(రేపటి) నుంచి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అన్ని నియోజక వర్గాల ఆర్‌ఓలు అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎక్కడా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్లు స్వీకరించే గదిలో 360 డిగ్రీల కోణంలో పని చేసే సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, రాకపోకల ద్వారాన్ని సీసీ కెమెరా ద్వారా రికార్డు చేయాలని సూచించారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు మూడు వాహనాల్లో మాత్రమే రావాల్సి ఉంటుందని, వాటిని ఆర్‌ఓ రూముకు 100 మీటర్ల దూరంలోనే నిలిపివేసేలా చూడాలన్నారు. అలాగే నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అనుమతి ఇవ్వాలన్నారు. డీఎస్పీ సమాన ర్యాంకు అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని ఆదేశించారు.

నూతన ఖాతా తెరవాలి..

అభ్యర్థులకు ఇచ్చే చెక్ లిస్టును ఆర్‌ఓలు డూప్లికేట్ తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థి ఏదైనా బ్యాంకులో ఖాతా తెరిచి దాని వివరాలను సంబంధిత ఆర్‌ఓలకు అందజేయాలన్నారు. ఈ ఖాతాను నామినేషన్ ముందు రోజైనా ఓపెన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. మే 4, 5 తేదీల్లో పీఓలు, ఏపీఓలకు, 7, 8 తేదీల్లో ఓపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి..

జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీరు,



ఆర్‌ఓలతో వీసీ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ర్యాంపులు, పార్కింగ్ ప్రదేశాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గాలకు నిర్దేశించిన కౌంట్ మేరకు ఈవీఎం, వీవీప్యాట్ తదితర సామాగ్రిని భద్రంగా చేర్చాలన్నారు. ప్రత్యేకించి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, థర్డ్ జెండర్ ఓటర్లకు నిర్దేశించిన ఏర్పాట్లు చేయాలన్నారు. హోం ఓటింగ్‌కు అర్హులైన వారి డేటాను సేకరించాలన్నారు. ఓటింగ్ శాతం పెంచడంపై ఆర్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన కేంద్రాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్‌ఓను ఆదేశించారు. ఈనెల 17, 18 తేదీల్లో అబ్జర్వర్లు జిల్లాకు రానున్నారని... దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్‌కు ముందురోజు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్‌కు సంబంధించిన నియమ నిబంధనలు తెలియజేయాలన్నారు. వీసీలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, కదిరి, ఆర్డీఓలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, మడకశిర నియోజక వర్గ ఆర్‌ఓ గౌరీ శంకర్, పలువురు ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్వింటా ఎండుమిర్చి రూ.18 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండుమిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండుమిర్చి క్వింటా గరిష్ట ధర రూ.18వేలు పలికింది. మార్కెట్‌కు మంగళవారం వంద క్వింటాళ్ల సరుకు వచ్చింది. ఈ-నామ్ ద్వారా వేలం వేయగా కనిష్టం రూ.7,200, గరిష్టం రూ.18వేలుగా పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

రెడ్డి సోదరులు ఏకం కావాల్సిన సమయమిదే

- ఏపీ రెడ్డి జన సంఘ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రొద్దం సురేష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలతో రెడ్డి జాతి కీర్తిని దశదిశలా వ్యాపింప చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హతమార్చేందుకు కొందరు కుట్ర పన్నడం దుర్మార్గమని ఏపీ రెడ్డి జన సంఘ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రొద్దం సురేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ కుటుంబంలో చిచ్చుపెట్టి ఆ ప్రయత్నం ఫలించక పోవడంతో పూర్తిస్థాయిలో వైఎస్ జగన్‌ను అడ్డు తొలగించుకునేందుకు పథకం రచించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెడ్డి సోదరులంతా ఏకమై ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నార. జాతి మొత్తాన్ని విడదీసి నిర్వీర్యం చేసే కుట్ర నుంచి మనల్ని మనం కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

నలుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యల్లో భాగంగా మంగళవారం నలుగురు వలంటీర్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో రాయదుర్గం మండలం బొందనకల్లు గ్రామానికి చెందిన వలంటీర్లు ఆర్.మంజునాథ్ నాయక్, ఆర్.పాపారాయుడు, బి.భోజరాజు, అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామ క్లస్టర్-8 వలంటీర్ కె.అఖిలభాను ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికల వెల్లువ



కదిరిలో కండువా వేసి పార్టీలోకి స్వాగతిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎన్‌పీకుంట : పార్టీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మక్బూల్ అహ్మద్, బోయ శాంతమ్మ



మంత్రి సమక్షంలో పార్టీలోకి చేరిన వేణుగోపాల్‌రెడ్డి

- టీడీపీ నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీలోకి
- మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో చేరికలు
- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిన

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. వేలాదిమంది ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై కొడుతున్నారు. విశ్వసనీయత, రాజకీయ విలువలు కలిగిన వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో మంగళవారం చేరికల కార్యక్రమాలు జరిగాయి. కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మంది ఆయన అనుచరవర్గం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. అత్తార్ రెషిడెన్షియల్ లాడ్జిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరికి మంత్రితో పాటు కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో మాజీ కౌన్సిలర్ అల్లాబకాష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శంకర్, మండి మహబూబ్ బాషా, సూరి, బాలచంద్ర, బాబురెడ్డి, రాజా, రియాజ్, అశోక్‌నాయుడు, హైదర్‌వలి, మస్తాన్, మధు, బాదల్, రామచంద్ర, మహమ్మద్, కిషోర్, జావీద్, అమ్ముద్దీన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బోయ శాంతమ్మ, మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు సైనికుల్లా పనిచేస్తామని ప్రతినబూనారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎన్నికల అసెంబ్లీ ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్ పాల్గొన్నారు.

- అలాగే కదిరి బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

ఎన్‌పీకుంట: పెడబల్లి పంచాయతీ ఎన్‌జీపీ తండా, పెడబల్లి గ్రామాలకు చెందిన 82 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. పెడబల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డి గారి హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం ఎంపీ బోయ శాంతమ్మ సమక్షంలో పెడబల్లికి చెందిన 22 కుటుంబాలు, ఎన్‌జీపీతండాకు చెందిన 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పార్టీ సీనియర్ నాయకులు బాలకృష్ణనాయుడు, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దేశాయ్ భారతీరెడ్డి, ఎం.పుల్లారెడ్డి, ఎం.మహేశ్వరరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తేనీటి విందు..

పాపన్నగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆవుల బాలకృష్ణనాయుడు స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్, ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, నాయకులు పూల శ్రీనివాస్‌రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆవుల శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి ఆర్డీటీ సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌లు

జిల్లాలోని శిక్షణ శిబిరాలు		
సెంటర్	కోచ్	ఫోన్ నంబర్
బత్తలపల్లి	భానుప్రకాష్	91779 95538
ధర్మవరం	రాజశేఖర్	99859 29285
హిందూపురం	సల్మాన్‌ఖాన్	83281 82794
కదిరి	నజీర్ అహమ్మద్	94908 60339
మడకశిర	నాగేంద్ర	94405 66697
పెనుకొండ	ఎస్ఎల్ఎన్ ప్రసాద్	89850 89910

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మధుఆచారి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 సబ్‌సెంటర్లలో కోచింగ్ క్యాంప్‌లు ఉంటాయి. మే 1 నుంచి 21వ తేదీ వరకూ ఈ శిబిరాలు నిర్వహిస్తారు. 8 నుంచి 16 సంవత్సరాల వయసున్న బాలబాలికలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కోచ్‌ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో జేఎల్ఎం దుర్మరణం



మృతి చెందిన మురళీకృష్ణ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో జేఎల్ఎం దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. ఎన్ఎస్‌గేట్ గ్రామానికి చెందిన మురళీకృష్ణ (40) బసినేపల్లిలో జూనియర్ లైన్‌మ్యాన్ (జేఎల్ఎం)గా పనిచేస్తున్నారు. మంగళవారం విద్యుత్ సమస్య ఉంటే పరిష్కరించి.. ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయల్దేరాడు. ఎన్ఎస్‌గేట్ నుంచి ధర్మవరం వెళ్లే దారిలో ఉన్న పెట్రోల్ బంకు సమీపాన గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. మురళీకృష్ణకు భార్య కవిత, కుమారుడు సాయినాథ్, కుమార్తె అమృత, తల్లిదండ్రులు అంజినమ్మ, చలపతి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలియగానే విద్యుత్ సిబ్బంది, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

డీలర్‌పై చర్యలకు నివేదిక

చిలమత్తూరు: చిలమత్తూరు సచివాలయ పరిధిలోని చౌకధాన్యపు డీలర్ అనిత టీడీపీ కండువా కప్పుకోవడంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోనున్నట్టు ఆమె చెప్పారు.

చీటింగ్ కేసులో ఒకరి అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

రొళ్ల: భూముల వ్యవహారంలో చీటింగ్‌కు పాల్పడిన సోమశేఖర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వెనక సర్వేనంబరు 186-1లో పైకి 1.83 సెంట్లు, సర్వే నంబర్ 187-3ఎ పైకి 0.84 సెంట్లు, సర్వే నంబర్ 187-4ఎ పైకి 0.86 సెంట్లు మొత్తం 3.53 ఎకరాల విస్తీర్ణాన్ని రొళ్లకు చెందిన లక్ష్మీనారాయణగౌడు అతని మామ వి.నాగరాజు కలిసి కొనుగోలు చేశారు. అందులో లే అవుట్ ఏర్పాటు చేసి ప్లాట్లు వేశారు. వరసకు బావమరిది అయిన బెంగళూరుకు చెందిన వి.నాగరాజు కుమారుడు సోమశేఖర్ అనే వ్యక్తి లక్ష్మీనారాయణగౌడుకు తెలియకుండా సదరు భూమిలో ప్లాట్లను బెంగళూరుకు చెందిన మహేష్ కుమార్, లోక్‌నాథ్ అనే ఇద్దరు వ్యక్తులకు హిందూపురంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ప్రస్తుతం ఆ లేఅవుట్ భూమి విలువను బట్టి రూ.రెండు కోట్లు. ఆ మొత్తంలో తనకు ఎటువంటి భాగం చెల్లించకుండా మోసగించడంతో లక్ష్మీనారాయణగౌడు తన మామ నాగరాజు, బావమరిది సోమశేఖర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మడకశిర జేఎఫ్‌సీఎం కోర్టులో సోమశేఖర్‌ను మంగళవారం హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. ఈ కేసులో మామ వి.నాగరాజు పరారీలో ఉన్నారు. రిమాండ్‌కు తరలించిన సోమశేఖర్ బెంగళూరులో ఇస్రో కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఉట్టి తిరునాల



ఉట్టిని అందుకున్న సాయి బృందం యువకులు

గాండ్లపెంట: కటారుపల్లి యోగివేమన ఉత్సవాల్లో మంగళవారం సాయంత్రం ఉట్టితిరునాల ఉత్సాహంగా సాగింది. ఆలయం ఎదుట ఇనుప స్తంభం ఏర్పాటు చేసి దానికి నూనె, గ్రీసు పట్టించారు. స్తంభం పైభాగంలో రూ.5,005 నగదు, పూలతో ఉట్టి కట్టారు. ఈ ఉట్టిని అందుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. మద్దివారిగొందికి చెందిన సాయిబృందం యువకులు ఉట్టిని కైవసం చేసుకున్నారు. అనంతరం వేమన సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు గ్రామస్తులు, ఆలయ పీఠాధిపతులు నందావేమారెడ్డి, వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నేడు గొడుగుల మెరవణి ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం స్వామి వారి గొడుగుల మెరవణి నిర్వహించనున్నారు.

పరమటివీరన్నకు భారీగా పన్నారపు బండ్లు



టెంకాయ పట్టలతో అందంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్‌లో వెళ్తున్న దృశ్యం

బత్తలపల్లి: మూగజీవాల పట్ల కరుణ చూపే ఆరాధ్యదైవం పరమటివీరన్నకు శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మంగళవారం బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం ప్రాంతాల నుంచి భారీగా పశువులు, పన్నారపు బండ్లు తరలివెళ్లాయి. తాడిమర్రి మండలం ఆత్మకూరు సమీపంలో వెలసిన పరమటివీరన్నకు మొక్కుకుంటే పశువులకు కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. దీనిని పాటించే రైతులు తమ ఆవులు, గేదెలు ప్రసవించిన మొదటి రోజున పాలను ఆయనకు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. రైతులు పన్నారపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకుని వెళ్లి ప్రదక్షిణలు చేశారు. ప్రతి ఇంటి నుంచి తీసుకెళ్లిన పిడికెడు బియ్యం, బేడలు, బెల్లం సమర్పించారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగి



టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రికార్డ్ అసిస్టెంట్ రమేష్

కంబదూరు: మండలంలోని మర్రిమాకులపల్లి పంచాయతీలో ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు చేపట్టిన కార్యక్రమంలో అచ్చంపల్లికి చెందిన రమేష్ అనే ప్రభుత్వ ఉద్యోగి పాల్గొన్నారు. ఈయన శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం ప్రభుత్వ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొనడం చర్చనీయాంశమైంది.

కారు డ్రైవర్ దారుణహత్య



రోదిస్తున్న హతుని కుటుంబ సభ్యులు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ అశోక్‌కుమార్

- 12 గంటల్లోనే నిందితుల అరెస్ట్
- ఆటో కిరాయి విషయంలో గొడవే కారణం



హత్యకు గురైన శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ధర్మవరం అర్బన్ : కారు డ్రైవర్ దారుణ హత్య ధర్మవరంలో కలకలం రేపింది. రంగంలోకి దిగిన పోలీసులు 12 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ అశోక్‌కుమార్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని తారకరామాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి (55) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 14న మదనపల్లిలో ఉన్న కుమారుడు వద్దకు వెళ్లి 15న రాత్రి మదనపల్లి నుంచి రైలులో బయలుదేరి మంగళవారం తెల్లవారుజామున ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చి అంకాలమ్మ దేవాలయం వద్ద ఉన్న ఆటో డ్రైవర్ లోకేంద్ర, అతని స్నేహితుడు విష్ణువర్ధన్‌ల వద్దకు శ్రీనివాసులురెడ్డి వెళ్లాడు. ఇంటికెళ్లడానికి ఆటో కిరాయికి మాట్లాడుకునే విషయంలో గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహావేశాలకు లోనైన ఆటో డ్రైవర్ లోకేంద్ర, విష్ణువర్ధన్‌లు కట్టెలు, రాళ్లతో కొట్టి శ్రీనివాసులు రెడ్డిని చంపారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు తెలుసుకుని సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించారు. పట్టణంలోని తారకరామాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుకవైపు నిందితులు తిరుగుతుండగా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఆటోతో పాటు హత్యకు ఉపయోగించిన కట్టెలు, హత్య చేసినప్పుడు ధరించిన రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. శ్రీనివాసులురెడ్డికి భార్య శారదమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. తండ్రి మృతదేహాన్ని చూసిన పిల్లలు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్య కేసును గంటల వ్యవధిలోనే చేధించిన సీఐ అశోక్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

ఓటమి భయంతోనే ఆరోపణలు

- సవితపై సీబీఐ కేసులున్నాయి
- ప్రజలంతా ఆలోచించి ఓటేయాలన్న మంత్రి ఉషశ్రీచరణ్



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న కార్యకర్తలు

రొద్దం: ఓటమి భయంతోనే టీడీపీ అభ్యర్థి సవిత తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. తనను నాన్‌లోకల్ అంటూ ప్రచారం చేస్తున్న సవిత ముందు టీడీపీలో పరిస్థితి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. హిందూపురంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలకృష్ణ లోకలా... నాన్‌లోకలా? మంగళగిరిలో పోటీ చేస్తున్న లోకేష్ ... లోకలేనా..? వీటికి సమాధానం చెప్పిన తర్వాత తన గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. మంగళవారం రొద్దం మండలం కలిపి, పెద్దమంతూరు, చెరుకూరు, చిన్నమంతూరు, నల్లూరు, చోళేమర్రి, సానిపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో మంత్రి పర్యటించారు. ఈ నెల 25న తన నామినేషన్ కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసిన మేలు ఇంటింటికీ తెలపాలని సూచించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రతి గడపకూ వివరించాలన్నారు. వార్డు మెంబర్‌గా కూడా కాని సవితపై సీబీఐ కేసులు ఎందుకు వచ్చాయో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఎవరు సేవ చేయగలరో ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక ..

మండలంలోని శేషాపురం, పెద్దమంతూరు గ్రామ పంచాయతీల్లో పలువురు కార్యకర్తలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, నాయకులు అక్కులప్పయాదవ్, మారుతీరెడ్డి, ధనుంజయ, సి.నారాయణ రెడ్డి, వినయ్‌రెడ్డి, రాజారెడ్డి, చిన్నమంతూరు రాము, రాజ్‌గోపాల్‌రెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, బోయ నరసింహులు, లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత..

గోరంట్ల: సామాజిక సాధికారత జగన్ పాలనలోనే సాధ్యమైందని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకోవడం తప్ప ఆయా వర్గాలకు ఒరగబెట్టిందేమీలేదని ఎద్దేవా చేశారు. మంగళవారం గోరంట్ల మండలం ఖాజాపురం, మందలపల్లి, కరావులపల్లి తండా, కరావులపల్లి, జావుకులదిన్న గ్రామాల్లో మంత్రి పర్యటించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే చిన్నచూపన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మందలపల్లి, కరావులపల్లి తండా సర్పంచులు ప్రమీలమ్మ, రమాదేవి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఆర్.వెంకటరెడ్డి, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, సుబ్బారెడ్డి, నార్శింపల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.